# "మా తండ్రి"

దేవుని గూర్చి బైబిల్లో ఎంత స్పష్టంగా, ఎంతటి గంభీరంగా, ఎంతటి భక్తి భావన కలిగేలా వర్ణనలు ఉన్నాయో! ఆయన గొప్ప సృష్టికర్త, నిర్మాత అనేదే నా తొలి అభిప్రాయం, నీవు నీ దానిని పొందినట్టే నేను నా భావాలను (ముద్రలను) నా తల్లి యొక్క మోకాళ్లయొద్ద పొందాను. తరువాత నేను యిలా చదువుతాను:

> పర్వతములను నిరూపించువాడును గాలిని పుట్టించువాడును ఆయనే. ఉదయమున చీకటి కమ్మజేయువాడును మనుష్యుల యోచనలు వారికి తెలియజేయువాడును ఆయనే; భూమియొక్క ఉన్నతస్థలముమీద సంచరించు దేవుడును సైన్యములకు అధిపతియునగు యెహోవా అని ఆయనకు పేరు (ఆమోసు 4:13).

అత్యున్నతమైన ఆయన సామర్థ్యములు మనలను వరిస్తాయి లేక ఆకర్షిస్తాయి: "ఆయన అదృశ్య లక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుటవలన తేటపడుచున్నవి ..." (రోమా 1:20). ఆలాటి దేవునియెదుట మనము ఆశ్చర్యచకితులమై నిలిచియుంటాం.

మరొక ఆరంభ భావం నా తల్లియు, తరువాత బైబిలును వేసింది, "దేవుడు కేవలం సృష్టికర్త మాత్రమే కాదు, కాని దేవుడు అందరి న్యాయాధిపతి" అనియు నేర్పించడం జరిగింది (హెబ్రీ. 12:23). ఆయన ప్రతి క్రియను తీర్పులోనికి తెస్తాడు, బహిరంగమైనది లేక రహస్యమైనది, అది మంచిదే గాని చెడ్డదే గాని (ప్రసంగి 12:14). గనుక మనము ప్రభువుయొక్క భయము నెరిగి (2 కొరింథీ. 5:11) మరియు తీర్పు యొక్క నిశ్చయత నెరిగి, నరమాత్రులమైన మనము ఆయన ఎదుట నిశ్చేష్టులమై నిలిచియుంటాం.

## మనము ఆయనకు బంధువులం

ఏదియెలాగున్నా, అతి ప్రియమైనదియు, దేవుని గూర్చిన ప్రశస్తమైన భావం, ఆయన అపరిమితమైన శక్తిగలవాడు అనేదో, ఆయన అందరి న్యాయాధిపతియనేదో కాక, ఆయన మన తండ్రి అనేదే. ఆయన మన తండ్రియై ఉన్నట్టయితే, ఆయనతో మనకు బాంధవ్యముంది, మరియు ఆయన మనకొరకు లక్ష్యపెట్టేవాడైయున్నాడు. మానవులే గాని జంతువులు ఆయన స్వరూపమందు చేయబడలేదు (యాకోబు 3:9). మనమీద ఆయనకున్న అక్కరను బట్టి, దేవుడు క్రీస్తుతో యిలా అన్నాడు, " –మన స్వరూపమందు మన పోలికెచొప్పున నరులను చేయుదము" (ఆది. 1:26ఎ). ఈ మనోహరమైన భావాన్ని తక్కువ జంతువులనుండి నరుడు వచ్చాడని తలంచే పరిణామ వాదులు అభినందించరు. "నరుడు దేవునికంటె కొంచెము తక్కువవాడుగా" చేయబడ్డాడన్న విషయంలో బైబిలు

విశ్వాసులు బహుగా ఉత్సహించుతారు (కీర్తన. 8:5; ASV). మరియు "ఆత్మలకు తండ్రియైనవానికి" కుమారుడై ఉండడం (హెబ్రీ. 12:9) ఆనందదాయకమే. సృష్టినిబట్టి మనుష్యులందరు దేవుని కుమారులే, మరియు మానవాళియంతటికి ఒక్కడే తండ్రి (ఆది. 6:2; లూకా 3:38; అపొ. 17:26).

మన పితృత్వము క్రిందనుండి గాక, పరలోకంనుండి వచ్చిందనే భావన, అప్పుడు, సంతోషాన్ని పుట్టిస్తుంది. ఏదియెలాగున్నప్పటికి, సృష్టినిబట్టి దేవుని కుమారుడైనవాడు, సువార్తనుబట్టి దేవుని కుమారుడు కానట్టయితే, అట్టివాని అంతము జంతువులకంటెను హీనమైనదైయుంటుంది. జంతువులు చనిపోతాయి, ఉనికిలో లేకుండా పోతాయి; కాని మనిషిలోనున్నదేదో ఒకటి ఎన్నటికిని చనిపోదు, అది నిత్యాగ్నియొక్క అపాయంలో ఉంటుంది. దేవునియొక్క సారూప్యము ధరించుకొనే ఆధిక్యతగలవాడు, తన తండ్రికి విధేయుడవ్వడానికి నిరాకరించినట్లయితే, అతడు పుట్టకుంటేనే మేలు అనిపిస్తుంది. సరిగా ఉండగోరితే, రెండు భావాలలో ఒక మనిషి దేవుని కుమారుడై యుండాలి: సృష్టి, నూతన సృష్టి. భూసంబంధమైన తల్లిదండ్రులకు ఒక శిశువుగా అతడు జన్మించాడు, అయితే అతడు తిరిగి జన్మించాలి (యోహాను 3:3). మన ప్రభువైన క్రీస్తునందు అతడు "నూతన సృష్టి కావాలి" (2 కొరింథీ. 5:17). "... ఒకడు[1] నీటి మూలముగాను ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడు" (యోహాను 3:5; KJV).

## మనము ఆయనకు ప్రశస్తమైనవారము

నీ తండ్రినిగూర్చి నీవు తలంచినప్పుడు నీ హృదయంలో ఎలాటి భావాలు ఉబుకుతాయో ప్రభువైన యేసుకు తెలుసు, మరియు దేవునిగూర్చి అలాగే తలంచాలని ఆయన తన శిష్యులను కోరాడు. తన బిడ్డ నోట ఆహారం పెట్టడానికిగాను భూసంబంధమైన తండ్రి ప్రయాసపడతాడు కదా "... పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవులనిచ్చును" (మత్తయి 7:11). నా తల వెంట్రుకలలో ప్రతిదానిని లెక్కించి, ఆయన అపరిమితుడై, నన్ను గురించి నేను ఎరిగిన దానిని మించి ఆయన ఎరుగును (లూకా 12:7). పిచ్చుకను సహితము ఎన్నడూ మరువని ఆయన తన పిల్లలకు యిలా అభయమిస్తున్నాడు, "మీరు అనేక పిచ్చుకలకంటె శ్రేష్ఠులు కారా" (లూకా 12:7).

"నా పిల్లలలో ప్రతి ఒక్కరు తక్కినవారివలెనే ప్రశస్తమైనవారు" అని ఏడుగురు పిల్లల తల్లి అంది. మనుష్యులైన తల్లి/తండ్రి ప్రేమించువారైయున్నప్పుడు, అనంతుడైన తండ్రి యింకా ఎంత ప్రేమామయుడై ఉంటాడు! భూగోళమందు మరోవైపునున్న వ్యక్తిపై ఎలా అక్కర కలిగియుంటాడో, నా మీదకూడ ఆలాటి అక్కరయే కలిగియుంటాడు. ప్రస్తుతం భూమిమీద నివసించే ఆరువందల కోట్ల మంది యొక్కయు, ఆత్మ లోకంలోని కోట్లకొలది మంది పేర్లు ఆయనకు తెలుసు. (హింస పొందుచున్న[2]) ఆత్మలు తమ విమోచకునికి బలిపీఠము క్రిందనుండి మొర పెట్టుకొనుచుండగా ఆయన వింటున్నాడు

(ప్రకటన 6:9, 10). దేవుని స్వరూపమందున్న ఆరువందల కోట్లకంటె ఎక్కువమంది ఒక్కసారే మొరపెట్టు కొనవచ్చు. వారందరి మొరను ఆలకించడం ఆయనకు కష్టమై ఉండదు. లేదు, ఒకే వ్యక్తి ఉనికిలో ఉన్నట్టే, వారిలో ప్రతి ఒక్కని మొరను ఆయన ఎంతో శ్రద్ధగాను, హృదయ స్పందనతోను వింటాడు.

## మనము ఆయనకు బాధ్యులమైయున్నాం

యథార్థత లేకుండ చేసే ఎవని ప్రార్థనను ఆయన అంగీకరించడనుకో. దేవునియొక్క చట్టమునుండి తొలిగిపోయిన వాని ప్రార్థన ఆయనకు హేయం (సామెతలు 28:9). దేవుని కన్నులు నీతిమంతుల మీదను, ఆయన చెవులు వారి ప్రార్థనలవైపునను ఉన్నవి గాని ఆయన ముఖము కీడు చేయువారికి విరోధముగా ఉన్నది (1 పేతురు 3:12). నీతిని జరిగించేవారు తనతో మాట్లాడాలని, వారు నిరాశ పడవద్దని ఆయన కోరుతున్నాడు (లూకా 18:1).

అటు భూలోకపు తండ్రియేగాని, యిటు పరలోకపు తండ్రియేగాని, తన బిడ్డ ఆగి "వందనాలు" అని చెప్పితే బహుగా ఆనందిస్తాడు. నేను తనతో మాట్లాడకుండ నా గదిలోనుండి ఉదయం పెందలకడనే లేచివెళ్లినట్టయితే, నా తండ్రి మనస్సు బాధ పడుతుంది. కఠినంగా, ఆలోచన లేకుండగనే నా దిన చర్యలను, ఆయన ఎరుకలేకుండ అంటే, ఆయన కరుణా హస్తపు కాపుదలను కోరకుండ, ఆరంభించినట్లయితే, ఆయన బాధపడతాడు. ప్రభువైన యేసువలె, నీకు సహాయపడే తండ్రితో రహస్యపు సంభాషణ లేకుండ దినచర్యగా ఏమి జరిగించాలో దాన్ని జరిగించలేవని నమ్మినట్లయితే (మార్కు 1:35), ఆయన ఆనందిస్తాడు; నీవు అరణ్య ప్రదేశానికి వెళ్లావో, లేక "రోజాలమీద యింకను మంచు బిందువులు నిలిచియుండగా,"[3] రహస్యమందున్న నీ తండ్రితో మాట్లాడ డానికి నడిచిపోయినా, ఆ దిన సహాయము నీవు పొందుతావు సరిగదా, సాతానుకు నీవు అంత సులభంగా లోనుకావు. "నీవు బ్రతుకు దినములలో నీకు విశ్రాంతి కలుగును ..." (ద్వితీయో. 33:25). దానియేలువలె, మధ్యాహ్నపు వేళ పరలోక సంబంధమైన స్థలములలో దైవికమైన సహవాసితో నీవు కూర్చుండగలిగితే, నీ దినచర్య కొనసాగించడం లోను, సహనముతోను దయతోను ఉండగలవు. సాయంత్రపు వేళ, నీ ఆహారంకొరకును, నీ పడకకొరకును, నీ కుటుంబం కొరకును, స్నేహితులకొరకును; కనికరము, కాపుదల కొరకును, క్షమాపణ శుద్ధీకరణ కొరకును కృతజ్ఞతలు చెల్లించడం మానుకొనకుము; రక్షణానందం నీకు పునరుద్ధరింపబడుతుంది, నీ నిద్ర గాఢమైనదిగాను, నెమ్మదికరమైనది గాను ఉంటుంది.

## ఆయన మన మనవి ఆలకిస్తాడు

నీకు తండ్రి ఉన్నాడు. ఆయన నీ తండ్రి. సర్వోన్నతునితో నేరుగా మాట్లాడుకునే భాగ్యం నరమాత్రులమైన మనకు ఉంది. ఆయన ఆకాశమునకును భూమికిని సొంతగాడైన

పరలోకపు తండ్రి. వేరొకనికి ప్రార్థించేలా మనం శోధింపబడనేల? అనేకమంది అమాయకపు ప్రజలు మరియకును, పరిశుద్ధులకును ప్రార్థించవలసినదిగా బోధింపబడు తున్నారు. కనీసం దేవదూతలకు సహితం యిలాటి ఆధిక్యతలేదు (మత్తయి 4:10; కొలస్సీ. 2:18; ప్రకటన 22:8, 9), అలాటప్పుడు నరమాత్రులకు శరీరంలో ఉన్నా శరీరంలో లేకున్నా యిలాటి భాగ్యం ఉందనుకొనడం తప్పుకదూ! (అపో. 10:25, 26; 14:15). మరియను పూజించేవారు "యుగముల వరకు స్తోత్రార్హుడైన, సృష్టికర్తకు ప్రతిగా సృష్టమును పూజించి సేవించిరి" (రోమా 1:25). మనిషి తన స్నేహితునితో మాట్లాడు కొంటున్నట్టు, పరిశుద్ధాత్మయు (రోమా 8:26, 27) ప్రభువైన యేసును మన పక్షముగా విజ్ఞాపనము చేయుచుండగా (1 యోహాను 2:1), మనము దేవునితో మాట్లాడుకొనే భాగ్యాన్ని బట్టి ఆనందించుదాం.

"Thou" అనేదానికి బదులు "You" అనేది దేవునికి సన్నిహితంగా ఉన్నట్లు కొందరు అన్నారు. "Thou" అనేది ఎక్కువ మర్యాదగా ఉంటుంది. ఎందుకంటె, వయస్సుతో గౌరవింపదగినదైయుంటుంది; సాధారణమైన పదాలకంటె (ఫార్మల్) మామూలైన భాష అంతకు మించిన గౌరవాన్ని చూపదు. లోకంలో పాపం ప్రవేశింపకమునుపు చల్లపూటవేళ ఏదెను చెట్లయొక్క కొమ్మల క్రింద ఆదాముతో ఆయన నడిచినట్టు నీతో నడవడానికి యిష్టపడుతున్న తండ్రికంటె యింకా సన్నిహితంగా నీవు ఉండలేవు (ఆది. 3:8ఎ లో గుప్తమైయున్నట్టు). మర్యాద లేకుండ నరుడు దేవునితో మాట్లాడవచ్చు దానినిబట్టి అతడు శిక్షార్హుడైయుంటాడు. ఏదియెలాగున్నా, సన్నిహితత్వం అనే భావంలో మనం ఆయన స్వరూపమందు చేయబడిన కారణాన దేవునితో మనం ఎక్కువ పరిచయం గలవారమై ఉండవచ్చు. గాఢమైన మన తలంపులతో మనం ఆయనను సమీపింపవచ్చు; మనలను గూర్చి సమస్తం ఆయన ఎరుగు. మన జీవితాలు ఆయన కృపామహిమకు కీర్తి కలుగజేయునట్లుండాలి.

## ఆయన అక్కర, భద్రత మనకుంది

నేను నా జీవితాన్ని గూర్చి సణిగినా, లేక నాకు వ్యతిరేకంగా కలుగుతున్న వాటి విషయంలో నేను ఫిర్యాదు చేసినా, యోసేపు అవమానపరచబడినప్పటికి అతనికున్న పరిశుద్ధమైన ప్రవర్తన మనలను సిగ్గుపరచాలి. తనకు సంభవించిన దానియంతటిలో తండ్రి చేయి ఉంది. ఆయన మనలను గూర్చి చింతించుతున్నందున, నా చింతయావత్తు ఆయన మీద వేయవలసిందిగా యోసేపు యొక్క తండ్రి మరియు నా తండ్రియు ఆజ్ఞాపిస్తున్నాడు (1 పేతురు 5:7). సణుగునట్టు నేను శోధింపబడినప్పుడు, కుమారుడు కొన్ని సార్లు శిక్షింపబడాలన్న సంగతిని "నీవు మరచితివా" అని ఆయన నెమ్మదిగా మందలిస్తాడు (హెబ్రీ. 12:5 చూడు). పాత క్రొత్త నిబంధనలలో ఆయన నాతో యిలా అర్థం చేసికోమని వాదించాడు: "–నా కుమారుడా, **ప్రభువు** చేయు శిక్షను తృణీకరించకుము ఆయన నిన్ను గద్దించినప్పుడు విసుకకుము. **ప్రభువు** తాను ప్రేమించువానిని శిక్షించి తాను స్వీకరించు ప్రతి కుమారుని దండించును" (హెబ్రీ. 12:5బి, 6).

నాకు యివ్వనివాటి విషయంలో భూ సంబంధమైన నా తండ్రివద్ద కన్నీరు విడిచి అడిగిన సమయాలు ఉన్నాయ్. అవి నాకు మేలు కాదని ఆయనకు తెలుసు. కొన్ని సార్లు పరలోకపు తండ్రియు నన్ను ప్రేమించినందున నేను అడిగినవి కొన్ని నాకు యివ్వక పోవచ్చు. మేలైనదేదో ఆయనకు తెలుసు. నేను ముసలితనానికి చేరుకున్నప్పుడు సహితం ఆయన ఎదుట నేను యింకను బాలుడనైయున్నాను. మనం ఆయన ఆజ్ఞలు గైకొని ఆయనకు ప్రీతికరమైనవాటిని చేయుచున్నంతకాలం, నీ నా ప్రార్థనలకు శ్రేష్ఠమైన రూపంలో బదులు యివ్వక మానడు (1 యోహాను 3:22). నీవు ఒకానొక దానికొరకు మాటిమాటికి మనవి చేస్తున్నా, నీవు నిరాకరింపబడ్డావంటే, తన శరీరంలో ఉన్న ముల్లుకొరకు మాటిమాటికి ప్రార్థించిన పౌలును జ్ఞాపకం చేసికో (2 కొరింథీ. 12:8, 9). యథార్థముగా ప్రవర్తించువారికి ఆయన యే మేలును చేయకమానడని విశ్వాస వాక్యం మనకు అభయమిస్తుంది (కీర్తన. 84:11). నీ మనవిని నిరాకరిస్తే అది ఏదో యొక మేలుకొరకేనని ఆయన నిన్ను ఎరుగ కోరతాడు.

మనము అడుగువాటన్నిటికంటెను ఊహించువాటన్నిటికంటెను అత్యధికముగా చేయ శక్తిగల దేవునికి (ఎఫెసీ. 3:20), ప్రభువైన యేసువలె, "నీవు మహా రోదనముతోను కన్నీళ్లతోను ప్రార్థనలను యాచనలను సమర్పించి నట్లయితే" (హెబ్రీ. 5:7), నీవు వాంఛించినది నిరాకరింపబడినందుకు నిరాశ చెందనక్కరలేదు. నీవు అడిగేది యితరులకు క్షేమం కలిగించేది కాకపోవచ్చు. దేవుడైన యెహోవా కన్నులు భూమియందంతట సంచరించుతూ (2 దినవృ. 16:9), నిత్యత్వంలోనికి ముందుగా చూస్తాయి. యేసు యొక్క తండ్రి ఆయన శ్రమ పెట్టబడడం చూడకోరలేదు, కాని, ఆయన ప్రార్థన నిరాకరింపబడింది. ప్రభువైన క్రీస్తుకు తండ్రియైన దేవుడే మన తండ్రి కూడా, నీవు పుట్టకమునుపే ఆయన నిన్ను చూచాడు. ఆయన నిన్ను నన్ను చూచినందుననే, దేవుడు తన జనతైక కుమారుని నలుగగొట్టి ఆయనకు వ్యాధి కలిగించాడు (యెషయా 53:10). తన తండ్రిని ఎల్లప్పుడును ఆనందింపజేసిన వాని మనఃపూర్వకమైన దయ పొందదగిన ప్రార్థనను సహితం (యోహాను 8:29) అంగీకరింపబడలేదు. నీవు మాటిమాటికి చేసిన విన్నపాన్ని నీ తండ్రి నిరాకరించినట్లయితే, తన జనతైక కుమారుని కంటె నీవు శ్రేష్ఠుడవు కావన్న సంగతిని నీవు జ్ఞాపకం చేసికోవాలి.

## ఆయన విశ్వాస్యత మనకున్నది

ఆయనకు అప్పగించిన దానిని రాబోవుచున్న ఆ దినమువరకు కాపాడగల సర్వశక్తు డగు తండ్రి నీకున్నాడు (2 తిమోతి 1:12). నీవు ఆయనను ప్రేమించుతున్నంత మట్టుకు (రోమా 8:28) నిత్య ఆశీర్వాదము నీకు లభించునట్లు సమస్తమును మేలు కలుగుటకై ఆయన సమకూర్చి జరిగిస్తాడు. నీ జీవితం యొక్క పరిస్థితులను మేలు కలుగునట్టు జరిగించేలా ఆయన ఎలా పర్యవేక్షించి అమర్చుతాడు? ఆ ప్రశ్నకు జవాబు నీకు అవసరం లేదు. నీ యొక్క అక్కర ఏమంటే సందేహింపకుండ నమ్మడమే. తాను సెలవిచ్చినది ఆయన జరిగిస్తాడు. ఆయన నమ్మదగినవాడు. అవిశ్వాసంవలన దేవుని వాగ్దానం

విషయంలో సందేహింపక, తండ్రియైన దేవుని "మహిమపరచుచు" విశ్వాసమునందు బలవంతుడవైయుండు (రోమా 4:20).

బాధలలో నీ వంతుకంటె ఎక్కువ అనుభవించినా, కష్టకాలం అధికమైనా, నిరీక్షణ యందు కడవరకు నమ్ముతూ, మరణంవరకు నీవు నమ్మకం గలవాడవై యుండాలి.

## మనకు ఆయన రక్షణ ఉంది

మేలుకలుగుటకై సమస్తం సమకూర్చి జరిగించడంలో, వ్యక్తిగతంగా ఆయన నీ అక్కరలను తీర్చడం మాత్రమే గాక (ప్రత్యేకమైన వ్యక్తిగతమైన దైవ కటాక్షం), సాతాను నిన్ను బహుగా సమీపిస్తున్నప్పుడు, ఆయన జోక్యం చేసికొంటాడు. నీ సామర్థ్యానికి మించి నీవు శోధింపబడడానికి ఆయన అనుమతించడు. సరిగదా, నీ మార్గంలో ఎదురయ్యే శోధనలు తప్పించుకునే మార్గాన్ని ఆయన నీకు గ్యారంటీ యిచ్చాడు (1 కొరింథీ. 10:13).

నీ తండ్రి అందరికంటె గొప్పవాడు. ఆయన చేతిలోనుండి నరుడే గాని, అపవాదియే గాని నిన్ను అపహరింపలేడు (యోహాను 10:28, 29). ఉత్తముడైన తండ్రి నిరంతరం నిన్ను విసర్జించేలా నీవు మసలుకోవచ్చు (1 దినవృ. 28:9), అయితే అది కేవలం నీ తప్పే ఔతుంది. నీవు పరలోకం పోదలచుకుంటే, తొట్రిల్లకుండ నిన్ను కాపాడుటకును, తన మహిమయెదుట ఆనందముతో నిర్దోషిగా నిన్ను నిలువబెట్టుటకును ఆయన చాలినవాడు (యూదా 24). ఎడమవైపున నిలబెట్టబడినవారై నిత్య నాశనమనే దండన పొందేవారు, తమ వ్రేలిని దేవునివైపు చూపి "ఈ నేరం నీది" అని ఎన్నటికిని చెప్పలేరు. మనం దోషం చేసినప్పుడు ఆయనకు బాధకలిగేది వాస్తవం మరియు మనలను రక్షించి, తనతో కూడ ఉంచుకొనడానికి ఆయన చేయవలసినదంతా చేశాడు.

> కాగా వారితో ఇట్లనుము –నా జీవముతోడు దుర్మార్గుడు మరణము నొందుటవలన నాకు సంతోషము లేదు; దుర్మార్గుడు తన దుర్మార్గతనుండి మరలి బ్రదుకుటవలన నాకు సంతోషము కలుగును. కాబట్టి ఇశ్రాయేలీయులారా, మనస్సు త్రిప్పుకొనుడి, మీ దుర్మార్గతనుండి మరలి మనస్సు త్రిప్పుకొనుడి, మీరెందుకు మరణము నొందుదురు? ఇదే ప్రభువగు యెహోవా వాక్కు (యెహెజ్కేలు 33:11).

మనుష్యులందరు రక్షింపబడాలని తండ్రి అభీష్టం (1 తిమోతి 2:4). ఎవడును నశింపవలెనని ఆయన యిచ్ఛయించడం లేదు (2 పేతురు 3:9). భూమిమీద తండ్రి తన బిడ్డలమీద జాలిపడునట్లు, తనకు భయపడువారి మీద పరమ తండ్రి జాలిపడతాడు, ఎలాగంటే, "మనము నిర్మింపబడిన రీతి ఆయనకు తెలిసేయున్నది మనము మంటి వారమని ఆయన జ్ఞాపకము చేసికొన్నాడు" (కీర్తన. 103:14). ఆయన "ఎంతో జాలియు కనికరముగలవాడు" (యాకోబు 5:11), "దయాదాక్షిణ్య పూర్ణుడు దీర్ఘశాంతుడు కృపా సమృద్ధిగలవాడు" (కీర్తన. 103:8).

## ముగింపు

ఆయన కృపవలన మనం ఆయన కుటుంబంలోనికి రాగలుగుతాం, ఆయన ఆత్మను పొందుతాం, క్రైస్తవేతరుడు చేయలేని విధంగా "మన తండ్రికి" ప్రార్థిస్తాం. క్రీస్తులోనికి బాప్తిస్మం పొందినవారు మాత్రమే, "నాయనా! తండ్రీ!" అని ప్రార్థించగలరు (గలతీ. 4:6). నీవు నిజంగా, "నాయనా! తండ్రీ!" అని పిలువగలిగినట్లయితే, నీవు యికను ఏ మాత్రము అపవాది కుమారుడవు, పాపానికి బానిసవు అయ్యుండవు, "కుమారుడవే, కుమారుడవైతే దేవునిద్వారా వారసుడవు" (గలతీ. 4:7). ఒక రాజ కుమారుడు దురుసు దనంతో నడుస్తూ, హృదయం ఉల్లాసంగా ఉంచుకోవచ్చు, అయితే పరలోకపు రాజుయొక్క కుమారుడు యింకా ఎంత సంతోషంగా ఉండాలి! "మనము దేవుని పిల్లలమని పిలువబడునట్లు తండ్రి మనకెట్టి ప్రేమననుగ్రహించెనో చూడుడి; మనము దేవుని పిల్లలమే. ఈ హేతువుచేత లోకము మనలను ఎరుగదు, ఏలయనగా అది ఆయనను ఎరుగ లేదు" (1 యోహాను 3:1).

నీవు ప్రార్థించేటప్పుడు, "మా తండ్రీ" అని చెప్పు.

---

సూచనలు

[1]"ఒక మనిషి" ప్రకృతి సంబంధమైన జన్మవలన ముందుగానే దేవుని కుమారుడైయుంటాడు కాని అలాటి కుమారత్వం సరిపోదు. [2]"బలిపీఠం క్రిందనున్న ఆత్మల" పరిస్థితి (ప్రకటన 6:9, 10), "నీకు ప్రశ్నలున్నాయా? దేవునికి జవాబులున్నాయి!" అని డేవిడ్ రోపర్ చర్చించాడు. [3]C. Austin Miles, "I Come to the Garden Alone," *Songs of Faith and Praise,* comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1996).